హైదరాబాద్ వార్త

విధి నిర్వహణలో ప్రతిభ చూపిన 1,446 మంది పోలీసులకు

'ఎక్స్‌ట్రా మైల్', 'గుడ్ వర్క్ డన్' రివార్డులు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, అసాధారణ ప్రతిభ కనబరిచిన 1,446 మంది పోలీసు సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఆదివారం రివార్డులు అందజేశారు. నగర పోలీసు చరిత్రలో తొలిసారిగా ప్రవేశపెట్టిన 'ఎక్స్‌ట్రా మైల్' పురస్కారాలతోపాటు 'గుడ్ వర్క్ డన్' రివార్డులను పోలీస్ సిబ్బందికి ఉన్నతాధికారులతో కలిసి ఆయన ప్రదానం చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(టీజీఐసీసీసీ) వేదికగా ఈ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అవార్డుగ్రహీతలను అభినందిస్తూ సీపీ సజ్జనర్ మాట్లాడారు. పోలీసు వృత్తి కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదని, అదొక సామాజిక బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. విధులకు మాత్రమే పరిమితం కాకుండా సమాజంపట్ల జవాబుదారీతనంతో వ్యవహరించాలని, ప్రతి పనిలోనూ సృజనాత్మకత, మానవీయత ప్రతిబింబించాలని పిలుపునిచ్చారు. అప్పగించిన పనిని పూర్తిచేయడంకంటే, బాధితులకు ఎంతటి భరోసాను కల్పించామన్నదే అసలైన విజయమని స్పష్టం చేశారు. విధులకు అతీతంగా సమాజంపట్ల బాధ్యతతో వ్యవహరించినప్పుడే పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో గౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు. సిబ్బందిలో ఉన్న అసాధారణ ప్రతిభను, వినూత్న ఆలోచనలను, విధులకు అతీతమైన సేవలను గుర్తించి, గౌరవించాలనే ఉద్దేశంతోనే కమిషనరేట్ చరిత్రలోనే తొలిసారిగా ఎక్స్‌ట్రా మైల్ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. విధులకు అతీతంగా సమాజానికి మేలుచేసే ప్రతి పోలీసు అధికారిని ఈ వేదిక గౌరవిస్తుందని చెప్పారు. ఇది కేవలం ఒక అవార్డు మాత్రమే కాదని, అంకితభావానికి దక్కిన గుర్తింపు అని అన్నారు. ఈ గుర్తింపు పోలీసుల్లో నూతనోత్తేజాన్ని నింపుతుందని, ఇతరులు నిబద్ధతతో పనిచేసేలా ప్రేరణనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతికత ఎంత పురోగమించినా, క్షేత్రస్థాయిలో పోలీస్ సిబ్బంది చూపే చిత్తశుద్ధికి, ఆపదలో ఉన్నవారిపట్ల ప్రదర్శించే మానవత్వానికి ఏ టెక్నాలజీ సాటిరాదని గుర్తు చేశారు. హోంగార్డు నుంచి ఉన్నతాధికారి వరకు ప్రతిఒక్కరూ ఒకే బృందంగా పనిచేయడం వల్లే నగరంలో శాంతిభద్రతలు సమర్థంగా ఉన్నాయని కొనియాడారు. ఈ పురస్కారాలు ఇక్కడితో ఆగిపోవని, ప్రతిఒక్కరిలో స్ఫూర్తిని నింపేందుకు ఇకపై ప్రతి నెల జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లకు రివార్డులు అందజేస్తామని తెలిపారు. పోలీస్ సిబ్బంది కృషి, నిజాయితీ వృథాకాదని, కష్టానికి తగ్గ గుర్తింపు కచ్చితంగా ఉంటుందన్నారు. కాగా, గత ఆర్థిక ఏడాదికి సంబంధించిన 2, 3, 4వ త్రైమాసికాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ఈ అవార్డులకు ఎంపిక చేశారు. ఎక్స్‌ట్రా మైల్‌లో భాగంగా విధి నిర్వహణలో విధులకు అతీతంగా సేవలందించిన 271 మందికి ఈ పురస్కారం దక్కింది. గుడ్‌వర్క్ డన్‌లో భాగంగా విధుల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 1,175 మందికి ఈ రివార్డులు వరించాయి. పురస్కారాలు అందుకున్నవారిలో అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, హోంగార్డులతో పాటు మినిస్టీరియల్ సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీపీ ఎం.శ్రీనివాసులు, జాయింట్ సీపీ నార్త్ రేంజ్ ఎన్.శ్వేత, డీసీపీలు ఎస్.చైతన్యకుమార్, శిల్పవల్లి, వి.అరవింద్ బాబు, లావణ్యనాయక్ జాదవ్, కె.వెంకటలక్ష్మి, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నగర సీపీ సజ్జనార్ చేతుల మీదుగా రివార్డులు అందుకున్న పోలీసులు

అసెస్‌మెంట్ చేసిన 'ఇంటి దొంగలు' ఎవరు?

* గుట్టు రట్టు కావడంతో నీళ్లు నములుతున్న అధికారులు
* చేయి తడిపితే ఏదైనా చేసే ఘటికులు
* బ్లాక్‌చేసి చేతులు దులుపుకుంటే ఎలా?
* సూత్రధారులు పాత్రధారులను పట్టుకోరా!

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ఇంటి దొంగను ఈశ్వరుడైన పట్టుకోలేడనే నానుడి వ్యవహారం జిహెచ్ఎంసి కార్యాలయంలో కొనసాగుతోంది. ఎవరు చూస్తారు ఎవరు అడుగుతారు ఎవరు పట్టించుకుంటారు అనే భయం లేకుండా జిహెచ్ఎంసిలో అనేక అక్రమాలను కొందరు అధికారులు యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అక్రమాలను సక్రమం చేసేందుకు అధికారులు లక్షల రూపాయలు తీసుకుని భరోసా కల్పిస్తుండడంతో జిహెచ్ఎంసిలో అవినీతి మితిమీరిపోతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక సర్కిల్ కార్యాలయం నుంచి జరగాల్సిన అసెస్‌మెంట్ కార్యక్రమం మరో సర్కిల్ కార్యాలయం నుంచి జరిగిందంటే ఇది ఇంటి దొంగల పనే అని బట్టబయలు అవుతోంది. కోర్టు వివాదంలో ఉన్న హయాత్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఓ ఇంటికి సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం అధికారులు అసెస్‌మెంట్ చేసి క్లీన్‌చిట్ ఇచ్చారంటే వారి పనితనం వారి అవినీతి ఎలా ఉందో బట్టబయలవుతోంది. పలు పనుల కోసం సర్కిల్ కార్యాలయానికి వచ్చే సామాన్యులను నిబంధనల పేరుతో నెలలు, సంవత్సరాల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకునే అధికారులు చేయి తడిపితే మాత్రం తమ పని కాకపోయినా దగ్గరుండి మరి అక్రమాలను సక్రమం చేస్తారనడానికి మన్సూరాబాద్ డివిజన్‌లోని 3-8-439/1 ఇంటి నెంబర్‌కు గతఏడాది పిటిఐఎన్ నెంబర్ 1050315474 కేటాయిస్తూ అసెస్‌మెంట్ చేయడమే అందుకు ఉదాహరణ. సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, ఏఎంసి శ్రీనివాస్‌రావు లాగిన్ నుంచి ఈ అవినీతి ప్రక్రియ పూర్తయినట్టు నెల రోజుల క్రితం బట్టబయలు కావడంతో అధికారులు నీళ్లు నములుతున్నారు. వారి లాగిన్ నుంచి ప్రక్రియ పూర్తిస్థాయిలో జరిగినప్పటికీ ఈ వ్యవహారంతో మాకు ఎలాంటి సంబంధం లేనట్లు డిప్యూటీ కమిషనర్, ఏఎంసీలు నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు. ఈవిషయమై డిప్యూటీ కమిషనర్‌ను వివరణ కోరగా ఆర్కేపురం డివిజన్ అల్కాపురి కాలనీకి చెందిన డాక్యుమెంట్లు ఉండడంవల్లే మా పరిధిలోకి వస్తుందని అసెస్‌మెంట్ చేశామని ఒక సారి, కిందిస్థాయి అధికారి ఫైలు పంపించడం వల్లే క్లియరెన్స్ ఇచ్చానని మరోసారి సమాధానం ఇస్తున్నారు. తప్పు జరిగిన వ్యవహారంలో సదరు అధికారి రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతుంది. కాగా నాకు తెలియకుండానే నా లాగిన్‌నుంచి ఫైలు ప్రక్రియ జరిగిందని ఏఎంసి అంటున్నాడు. అయితే ఒకరు తప్పు చేసినా మరొకచోట ఫైలుకు సంబంధించిన వ్యవహారం బయటకు రావాల్సిందే. అయితే ఈ వ్యవహారంలో కలిసిమెలిసి పనిచేయడం వల్లే అక్రమాన్ని సక్రమంచేస్తూ క్లియరెన్స్ ఇచ్చినట్లు బట్టబయలు అవుతుంది. తప్పు జరిగిన మాట వాస్తవమే అని ఒప్పుకుంటున్నా అధికారులు క్లియరెన్స్ ఇచ్చిన ఫైలును బ్లాక్ చేసినట్లు చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. తప్పు ఎలా జరిగింది? ఎవరి ద్వారా జరిగింది? ఎవరి ప్రమేయంతో జరిగింది? కారకులెవరు, సూత్రధారులు, పాత్రదారులు ఎవరు అనే విషయాన్ని మాత్రం అధికారులు బట్టబయలు చేయడం లేదు. అవినీతి అధికారుల ఆగడాల వల్ల జిహెచ్ఎంసికి రావలసిన కోట్లాది రూపాయల ఆదాయం పోతోంది. ఇంటి దొంగల పని వల్ల ఇటువంటి అక్రమాలు ఇంకా ఎన్ని జరిగాయో వెలుగు చూడాల్సి ఉంది. జిహెచ్ఎంసి రెవెన్యూ విభాగంలో పైనుంచి కిందిస్థాయి వరకు అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ జిహెచ్ఎంసి ఖజానాకు గండికొడుతూ అక్రమాలను ప్రోత్సహిస్తున్నారని పలువురు అధికారుల తీర్పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా అతిపెద్ద కమర్షియల్ ప్రాంతమైన గడ్డిఅన్నారం, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాలలో రెవెన్యూ విభాగం అధికారులు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. త్వరలో వారి అవినీతి బాగోతం కూడా పట్టబయలు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఉత్తేజకరంగా బాబా శ్యామ్ నిషాన్ రథయాత్ర

కాచిగూడలో శ్యామ్‌బాబా నిషాన్ రథయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : బాబా శ్యామ్(శ్రీకృష్ణుడు) భక్తుల కోరికలన్నీ నెరవేరుతాయని నమ్ముతూ ఫల్గుణి ఏకాదశి వేడుకలలో భాగంగా ఆదివారం జరిగిన "బాబా శ్యామ్ నిషాన్(జండా) రథయాత్ర" అపూర్వమైన స్థాయిలో నగరం అంతటా భక్తివాతావరణాన్ని సృష్టించి మంత్ర ముగ్ధులను చేసింది. శ్రీశ్యామ్‌మందిర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన "బాబా శ్యామ్ నిషాన్(జండా) రథయాత్ర" చార్మినార్, మహాదేవ్ మందిరంవద్ద రథంపై అత్యంత ప్రత్యేకమైన పుల అలంకరణతో ఉన్న బాబా శ్యామ్‌కు హారతి ఇచ్చిన అనంతరం రథాన్ని లాగుతూ కుంకుమ, తెలుపు, ఎరుపు, పసుపు, నీలం, ఆకాశ నీలం, ఆకుపచ్చ, గులాబీ రంగుల జండాలను చేతబూని వేలాదిమంది భక్తులతో అత్యంత చాలా పవిత్ర మైనదిగా పరిగణించబడే "బాబా శ్యామ్ నిషాన్ (జండా) రథయాత్ర" ప్రారంభమైంది. రథంతో పాటు ఆకర్షణీయమైన శకటాలతో, ఉరుతలూగించే ప్రపంచ ప్రసిద్ధ గాయకుడూ కన్నయ్య మిట్టల్ భక్తి పాటలతో ప్రారంభమై చార్మినార్ మహాదేవ్ మందిరం నుండి కాచిగూడ శ్రీశ్యామ్‌బాబా మంది రం వరకు సాగిన ఈ కాలినడక యాత్రకు వివిధ మార్గాల్లో పూల వర్షం కురిపిస్తూ భక్తులు నిషాన్ యాత్రకు ఘన స్వాగతం పలికారు. భక్తులు నిజ మైన హృదయంతో శ్యామ్ బాబాను స్మరిస్తూ, జై శ్రీశ్యామ్ అని నినాదాలుచేస్తూ, కీర్తనలు, శ్లోకాలు, నృత్యకారులు, భజనల స్వరాలకు అనుగుణంగా నృత్యం చేస్తూ, రంగులు, గులాల్ విసురుకుంటూ, మొత్తం వాతావరణాన్ని శ్యామ్ స్ఫూర్తితో నింపారు. బాబా శ్యామ్ పట్ల తమ అచంచలమైన భక్తిని, విశ్వాసాన్ని వ్యక్త పరుస్తూ వేలాదిమంది భక్తులు తమ నిషాన్(జండా)లను కాచిగూడ శ్రీశ్యామ్ మందిర్‌లో సమర్పించారు. బాబా శ్యామ్ రథశోభ యాత్ర కమిటీ చైర్మన్ ఇంద్రకరణ్ అగర్వాల్, వైస్ చైర్మన్ లు రామ్‌దేవ్ అగర్వాల్, పురుషోత్తందాస్ గోయల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యంత వైభవం గా నిర్వహించిన బాబా శ్యామ్ రథయాత్రలో భక్తుల వెల్లువ, భక్తికి ఒక అపురూప దృశ్యం అని, దుఃఖాలు, బాధలు తొలగిపోతాయని, అచంచల మైన విశ్వాసంతో కాలినడకన నిషాన్ యాత్ర చేసే భక్తులపై బాబా శ్యామ్ ప్రత్యేక ఆశీస్సులు ఉంటా యని తెలిపారు. రాజస్థాన్, ఖాటు ధామ్‌లో బాబా శ్యామ్ రథయాత్ర నిర్వహించినట్లు హైదరాబాద్‌లో భక్తులు చారిత్రాత్మక ఘట్టంగా నిర్వహించారని అన్నారు. ఈయాత్రలో కమిటీ సలహాదారు చంద్ర కాంత్ డకోటియా, కన్వీనర్‌లు అమిత్ అగర్వాల్, రాంనిరంజన్ అగర్వాల్, సంతోష్ అగర్వాల్, నర్సింగ్ జైస్వాల్, జీవన్ భాటి, అభిషేక్ శర్మ, సుశీల్ అగర్వాల్, గోవింద్ పొద్దార్, శ్రీశ్యామ్ మందిర్ సేవా సమితి అధ్యక్షుడు చంద్రకాంత్ డకోటియా, ఉపాధ్యక్షులు కృష్ణకుమార్ బడేగావ్ వాలే, కార్యదర్శి ఇంద్రకరణ్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శులు రామ్‌దేవ్‌అగర్వాల్, రాజ్‌కుమార్ విగ్, కోశాధికారి కపిల్‌అగర్వాల్ పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ప్రతి పౌరుడు ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని తెలంగాణ ఆర్‌టిఐ, మానవ హక్కుల అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం సైఫాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 'ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని' రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆసోసియేషన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోయేషన్ ఛైర్మన్ అజయ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంపై, రాజ్యాంగంపై నిబద్ధతతో ప్రజా సమస్యలపై స్పందించే మంచి నాయకులను మాత్రమే ఎన్నికల్లో ఎన్నుకోవాలని కోరారు. ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, షాపింగ్ మాల్స్, పరిశ్రమలు తదితర సంస్థలను మూసి వేసి కార్మికులకు, ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించాలని ఆయన రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అసోసియేషన్ తరపున విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఎన్నికల కమిషన్ వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటిస్తామన్నందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ధారా మౌనిక, వెంకట్ నర్సింహారెడ్డి, పోచయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మానవ హక్కుల అసోసియేషన్ ప్రతినిధులు

ఆధ్యాత్మికతతోనే శాంతి, సౌభాగ్యం

హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త): ఆధ్యాత్మికత ద్వారానే సమాజంలో శాంతి, సౌభాగ్యం లభిస్తాయని హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో "దివ్యోహం" దివ్య సిద్ధేశ్వర మహోత్సవం విశ్వధర్మ చేతనా మంచ్, శ్రీ సిద్ధేశ్వర్ తీర్త్, బ్రహ్మర్షి ఆశ్రమం, లలిత మధుసూదన్ మొదాని, రేఖ రఘువీర్ పారక్, సుష్మ రాజీవ్ క్రమా ఆధ్వర్యంలో జరిగింది. బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్ధగురువర్ సిద్ధేశ్వర్ బ్రహ్మర్షి గురుదేవుల దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ బ్రహ్మర్షి సిద్ధేశ్వర్ గురుదేవుల వంటి మహనీయుల ఆశీస్సులు మన తెలుగు రాష్ట్రాలపై ఉండటం మన అదృష్టం అన్నారు. "ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహేష్ బ్యాంకు డైరెక్టర్ కైలాష్ నారాయణ్ భంగడియా, కార్యక్రమం కన్వీనర్ ప్రకాష్‌సేథియా, తెలంగాణ శాఖ అధ్యక్షుడు వి.రవిచంద్ర, ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు విమల్ కుమార్ నహార్, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

"దివ్యోహం" దివ్య సిద్ధేశ్వర మహోత్సవం కార్యక్రమాన్ని జ్యోతిని వెలిగించి బండారు దత్తాత్రేయ

రౌడీషీటర్ ఆయూబ్ ఖాన్‌పై కేసు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : మోసం, బెదిరింపులో పేరుమోసిన రౌడీషీటర్ ఆయూబ్ ఖాన్‌తోపాటు కుమ్మరివాడి నివాసి మహ్మద్ ఫారూక్‌పై శాలిబండ పోలీసుస్టేషన్లో కేసు నమోదైయింది. ఇన్‌స్పెక్టర్ పి.మహేష్‌గౌడ్ కథనం ప్రకారం... బాధితుడిని వ్యాపార భాగస్వామిగా చేర్చుకున్నారు. అతడు తన వాటాగా రూ.4.70లక్షలను పెట్టుబడిగా పెట్టాడు. వ్యాపారంలో వచ్చిన లాభాలను ఇరువురు దుర్వినియోగం చేయటంతోపాటు అప్పులు తీర్చేందుకని అతని వద్ద నుండి ఆరు తులాల బంగారు ఆభరణాలను తీసుకొని తనఖా పెట్టారు. అనంతరం వాటిని తిరిగి ఇవ్వలేదు. 2025 జనవరిలో తన వాటాగా పెట్టిన నగదు, బంగారు నగలు ఇవ్వాలని కోరగా బాధితుడిని ఆయూబ్ ఖాన్ బెదిరించాడు. పోలీసులకు చెబితే పరిణమాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించాడు. దీంతో బాధితుడు బయటకు చెప్పలేదు. తాజాగా బాధితుడు చేసిన ఫిర్యాదుతో పోలీసులు ఆయూబ్ ఖాన్, మహ్మద్ ఫారూక్‌లపై కేసు నమోదు చేశారు. పేరుమోసిన రౌడీషీటర్ ఆయూబ్ ఖాన్‌పై 79 కేసులున్నాయి. అతనిని పట్టుకోవటానికి ప్రత్యేక బృందాలను నియమించారు. రౌడీయిజం, దోపిడీలు, బెదిరింపులు, వ్యవస్థీకృత బెదిరింపులను ఎంత మాత్రం ఉపేక్షించేది లేదని చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే స్పష్టం చేశారు. ఆయూబ్ ఖాన్ ఆచూకీని తెలియజేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అతని సమాచారాన్ని శాలిబండ పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

పెళ్లి అవ్వట్లేదని యువకుడి ఆత్మహత్య

హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : హైదరాబాద్‌లో పెళ్లికావడం లేదని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు కథనం ప్రకారం..అత్తాపూర్‌కు చెందిన ప్రవీణ్(30) పెళ్లికావడంలేదని కొంత కాలంగా డిప్రెషన్‌లో ఉన్నాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం 20 అంతస్తుల భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం.. 604 మందిపై కేసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : నగర రహదారులపై భద్రతను పటిష్టం చేసేందుకు, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భారీ సంఖ్యలో మద్యంబాబులు పట్టుబడ్డారు. ఈనెల 6నుండి 7వ తేదీల్లో నగరవ్యాప్తంగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 604 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ డి.జోయల్ డేవిస్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం పట్టుబడిన 604 మందిలో ద్విచక్ర వాహనదారులు: 492 త్రీవీలర్ (ఆటోలు): 42, ఫోర్‌వీలర్ ఇతర వాహనాలు 70 వరకు ఉన్నాయని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలకే కాకుండా ఇతర అమాయక పాదచారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని జాయింట్ కమిషనర్ పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ఉల్లంఘనల పట్ల 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తున్నామని, ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నెంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : వాహనాల నంబర్ ప్లేట్లను మార్చడం లేదా ట్యాంపరింగ్‌కు పాల్పడటం తీవ్రమైన నేరమని, అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ డి.జోయల్ డేవిస్ హెచ్చరించారు. నంబర్ ప్లేట్ మార్చి ఇతర వాహనదారుడిని ఇబ్బందులకు గురిచేస్తున్న ఒక వ్యక్తిని చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఘటన వివరాలు: మలక్‌పేటకు చెందిన సయ్యద్ అలీవుద్దీన్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనం అసలు నంబర్ టిఎస్ 11ఇజెడ్ 2936 ను కావాలనే టిఎస్ 11 ఇజెడ్ 2836గా మార్చి వాడుతున్నాడు. ఈ క్రమంలో అసలైన వాహన యజమాని ఫహీమ్ అలీ, తన వాహనంపై వరుసగా ట్రాఫిక్ చలాన్లు వస్తున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మోసం బయటపడింది. నిందితుడు చేసిన ఉల్లంఘనల వల్ల, అసలు యజమాని వాహనంపై 23 చలాన్లు తప్పుగా నమోదయ్యాయి. నిందితుడిపై చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నగరంలోని సిసిటివి, ఏఎన్‌పీఆం కెమెరాల ద్వారా ఇటువంటి ట్యాంపరింగ్ కేసులను సులభంగా గుర్తిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. మీ వాహన నంబర్ ప్లేట్లు ఎవరైనా దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే వాట్సాప్ నంబర్: 8712661690 ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. తప్పుడు నంబర్‌ప్లేట్లు వాడటం చట్టరీత్యా నేరమని, ఉల్లంఘనలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని జాయింట్ కమిషనర్ స్పష్టం చేశారు.

అవినీతి కేంద్రాలు..ప్రభుత్వ విభాగాలు...

* తనిఖీలు మరచిన అధికారులు
* వివిధ స్థాయిల్లో అవినీతి మరకలు
* ఏసీబీకి చిక్కినా మారని ఉద్యోగులు
* ఎన్ని నిబంధనలున్నా వదలని కంపు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : పాతబస్తీలోని పలు ప్రభుత్వ విభాగాలు అవినీతికి కేంద్రాలుగా మారాయి. రాష్ట్రప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా పద్ధతి మారటం లేదు. పైగా కొంత మంది సిబ్బంది అవినీతి కోసమే పనిచేస్తున్నట్లు వ్యవహరిస్తున్నారు. వారి చేష్టలవల్ల నికార్సైన ఉద్యోగులు అపవాదు మోయాల్సి వస్తుంది. మరక మొత్తం ఉద్యోగులను ఆవిస్తోంది. లంచావతారులు అపుడపుడు అవినీతి నిరోధక శాఖ వలకు చిక్కుతున్నారు. ఆ తరువాత ఆయా కార్యాలయాలలో కొన్ని రోజులు నిశబ్ధత కొనసాగి షరా మామూలే అవుతుంది. ఔట్ సోర్సింగ్ సిబ్బంది తామేమి తక్కువ కాదన్నట్లు ప్రవర్తిస్తున్నారు. వీరిని నిలువరించాల్సిన ఉన్నతాధికారులు పట్టించుకోవటం లేదు. కనీసం నెలకోసారైన ఆకస్మిక తనిఖీలు, రికార్డుల పరిశీలన, ప్రజలతో మమేకం కావటం లేదు. దీంతో అవినీతి ఉద్యోగులు తమ ప్రవృత్తిని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. చూస్తుండగానే ఎదిగిపోతున్నారు. విలువైన స్థిర, చరాస్థులను కూడబెట్టుకుంటున్నారు. ప్రధానంగా జీహెచ్ఎంసి, పోలీసు, టీజీఎస్‌పీడీసీఎల్, రెవెన్యూ, ఆర్టీఎ, వాటర్ వర్క్స్, విద్య తదితర విభాగాలతోపాటు ఈ జాబితాలో చిన్నా చితక విభాగాలు మరిన్ని ఉన్నాయి. అక్కడా చేయి తడపందే పని జరగని పరిస్థితి నెలకొంది. జీహెచ్ఎంసిలో కింది నుంచి పై వరకు లంచావతారులు తమ చేతి వాటాన్ని చూపుతున్నారు. ఎవరిస్థాయిలో వారు అందిన కాడికి దోచుకుంటున్నారు. టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, ట్యాక్స్, పారిశుధ్యం తదితర సెక్షన్లలో అవినీతి వేళ్లూనుకుపోయింది. ఆయా విభాగాలలో కొంత మంది సిబ్బంది అవినీతి వలకు చిక్కినా వ్యవహారం మారటం లేదు. గత చార్మినార్ జోన్లో చాంద్రాయణగుట్ట డీసీ, కంప్యూటర్ ఆపరేటర్, రాజేంద్రనగర్ డిసి, యుబిడి డిప్యూటీ డైరెక్టర్, అంత్యక్రియల నిధుల మంజూరులో ఒక ఉద్యోగి లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కారు. ప్రధానమైన టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, ట్యాక్స్ విభాగాలు అవినీతికి కేంద్రాలుగా మారాయి. క్రమశిక్షణకు మారు పేరుగా నిలవాల్సిన పోలీసు శాఖ తామేమి తక్కువ కాదన్నట్లు అవినీతి కూపంలో ఇరుక్కుపోతుంది. కొంత మంది ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు నేరుగా కలక్షన్ కానిస్టేబుళ్లను నియమించుకొని కేసులు చక్కదిద్దుతున్నారనే విమర్శలున్నాయి. వీటిని రూఢీ చేసేలా అపుడప్పుడు కొందరు అధికారులు అవినీతి వలలో పడుతున్నారు. దొరికితే దొంగ అన్నట్లు చాప కింద నీరులా అవినీతి కొనసాగుతుంది. కేసులో నిందితులను అరెస్టు చేయకుండా ఉండేందుకు, కేసు తీవ్రతను తగ్గించేందుకు, సివిల్ తగాదాలలో తలదూర్చుటం వంటి కేసుల్లో పట్టుబడుతున్నారు. ఇక టీజీఎస్‌పీడీసీఎల్ (విద్యుత్) ఉద్యోగులు తామేమి తీసిపోలేదంటున్నారు. ఎడిఈ, ఎఇ స్థాయి ఉద్యోగులు సైతం అవినీతి వలకు చిక్కుతున్నారు. ప్యానల్ బోర్డుల మంజూరు, విద్యుత్ స్థంభాలు, హైటెన్షన్ తీగల మార్పు, వాణిజ్య, గృహ విద్యుత్ మీటర్లు, అదనపు మీటర్ల మంజూరు వంటి పనులలో తీవ్ర అవినీతికి పాల్పడుతున్నారు. ఇక క్రింది స్థాయి సిబ్బంది అవినీతి సరాసరి. మండల రెవెన్యూ కార్యాలయాలలో టేబుల్ కింద చేయి పెడితేనే పైన సర్టిఫికెట్ చేతికందుతుంది. పేరుకు మీ సేవా ద్వారా రెవెన్యూ సేవలందిస్తున్నా అంతా మిథ్యే. కార్యాలయంలోని కొంత మంది ఉద్యోగులు, మీ సేవా నిర్వాహకులు, మధ్య దళారులతో లంఛం స్వీకరిస్తున్నారు. ఎవరైనా సర్

మాట్లాడుతున్న జస్టిస్ మాధవిదేవి

అంతర్లీనంగా ఉన్న సప్త శక్తులకు జాగృతం చేయడానికే సప్తశక్తి సంగం : జస్టిస్ మాధవిదేవి

సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: మహిళల్లో అంతర్లీనంగా ఉన్న సప్తశక్తులను జాగృతం చేయడానికి సప్తశక్తి సంగం ఎంతోగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవి చెప్పారు. శ్రీసరస్వతి విద్యాపీఠం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలను జాగృతం చేయడానికి సప్తశక్తి సంగమాలు రావడం ముదావహం అని తెలిపారు. నారాయణగూడలోని కేశవ మెమోరియల్‌పటేల్ హాల్‌లో శ్రీసరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో సప్తశక్తి సంగం ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళల్లో శక్తులను జాగృతం చేయడం శ్రీసరస్వతీ శిశు మందిరాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రీయ సేవికాసమితి ప్రాంత కార్యవాహిక శ్రీపాద రాధ మాట్లాడుతూ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన ఏకాత్మ మానవ దర్శనాన్ని మహిళా శక్తికి అనుసంధానిస్తూ మాట్లాడారు. విద్యాపీఠం రాష్ట్ర వ్యాప్తంగా సప్తశక్తి సంగమాలు నిర్వహించి చరిత్ర సృష్టించారని కొనియాడారు. విదా్యపీఠం ప్రాంత కార్యదర్శి అనఘా వెంకటలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2,345 సప్తశక్తి సంగమాలు జరిగాయని, 30 వేల మందికిపైగా ఈ కార్యక్రమానికి మహిళలు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య క్షేత్ర బాలికా ప్రముఖ్ ధరణిప్రియ తదితరులు పాల్గొన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అసోసియేషన్ నాయకులు

సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: వెలమ కులాన్ని పదే పదే దూషిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే బేషరుతుగా క్షమాపణలు చెప్పాలని ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ డిమాండ్ చేసింది. హిమాయత్‌నగర్‌లోని వెలమ అసోసియేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తాండ్ర శ్రీనివాసరావు మాట్లాడుతూ గత కొంతకాలంగా మాజీ సిఎం కెసిఆర్‌ను టార్గెట్ చేస్తూ వెలమ కులాన్ని రేవంత్‌రెడ్డి తిడుతున్నారని ఆరోపించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న రేవంత్‌రెడ్డి ఇలా ఒక కులంపైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కెసిఆర్ తమ జాతికి మాత్రమే జాతిపిత కాదని, 14 ఏళ్లు ఉద్యమం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి రాష్ట్రానికి జాతిపితగా నిలిచారన్నారు. రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మానసిక, శారీరక దృఢత్వానికి కరాటే దోహదం: గట్ల

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: మానసిక, శారీరక దృఢత్వానికి కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం సీనియర్ నాయకుడు గట్ల రవీంద్ర(హైటెక్ రాము) పేర్కొన్నారు. న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 5వ అంతర్జాతీయ ఓపెన్ టూ ఆల్ స్టైల్స్ కరాటే కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ 2026 పోటీలలో ముఖ్యఅతిథి గట్ల రవీంద్రను ఎన్‌డిఎఫ్‌ఎంఎఏ వ్యవస్థాపక అధ్యక్షుడు, టోర్నమెంట్ నిర్వాహకులు పెద్దపూర శ్రీరాములు ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రోత్సహిస్తూ శిక్షణ ఇప్పించాలని, తద్వారా పిల్లలు శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉంటారన్నారు. ఈ పోటీలల్లో బాలికలు కూడా ఉత్సాహంగా పాల్గొనడం పట్ల అభినందించారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో అమ్మాయిలకు చదువుతో పాటు వారి ఆత్మ రక్షణ కోసం ఈ విద్యలు కూడా చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దపూర సైదులు, కనుముల సాయికృష్ణ, బండపల్లి కృష్ణరావు, మడిశెట్టి వినోద్, లక్ష్మణ్(నాని), చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

నూతన సంవత్సర డైరీని ఆవిష్కరిస్తున్న వరుణ్‌రెడ్డి, తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8(ప్రభాతవార్త) : తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమం అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్.కె.మాజీద్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. సంస్థ ప్రధాన కార్యాలయంలో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ వరుణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్.కె.మాజీద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.పర్వతాలు, నాయకులు ఈసాక్, కెయాదయ్య, జలీల్, లింగయ్య పాల్గొన్నారు. డైరీ ఆవిష్కరణ అనంతరం, కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న పలుసమస్యలను సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా (స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్) ధరల సవరణ గురించి పెండింగ్‌లో ఉన్న ఇతర సాంకేతిక అంశాల గురించి ఆయనకు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సిఎండి వరుణ్‌రెడ్డి అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేద్దామని, ఆ చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు వివిధ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో విద్యుత్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పాతబస్తీలో వైభవంగా నగర సంకీర్తన ఊరేగింపు

చార్మినార్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : హైదరాబాద్ హరేకృష్ణ నామ్ సంకీర్తన సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పాతబస్తీలో వైభవంగా నగర సంకీర్తన ఊరేగింపు జరిగింది. వందలాదిమంది బెంగాలీలు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. కాగా ఆదివారం ఉదయం కుడా స్టేడియం నుంచి ప్రారంభమైన సర్బీజనిన్ హరేకృష్ణ నామ్ సంకీర్తన ఊరేగింపు ఘాన్సీ బజార్, కోఠికి వాడి, ఝూలా, కోఠికి వాడి, షక్కర్‌కోట, ఆనందగల్లీ, కాలీకమాన్, చార్మినార్, గుల్జారాహౌస్, మామాజుమ్లా పాఠక్‌తో పాటు పలు ప్రాంతాల మీదుగా కొనసాగిన అనంతరం కుడా స్టేడియంకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ హరేకృష్ణ నామ్ సంకీర్తన సొసైటీ ప్రతి నిధులు నిమై మలిక్, శంకర్‌ఘోష్, హేమంత్ మలిక్ పాటు పలువురు పాల్గొన్నారు. కాగా చార్మినార్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఊరేగింపులో పాల్గొన్న హరేకృష్ణనామ్ సంకీర్తన సొసైటీ ప్రతినిధులు

ప్రభుత్వ భూముల్లో హాస్టల్స్ నిర్మించాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

విద్యార్థులకు అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, నీల వెంకటేష్, అనంతయ్య, రాజేందర్, అంజీ

సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం భూములను వేలం వేయరాదని, ఆ భూముల్లో లక్షలాది మంది విద్యార్థుల కోసం హాస్టల్స్, గురుకులాలకు సొంతభవనాలను నిర్మించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. అలాగే 150 బిసి కాలేజీ హాస్టల్స్ మంజూరు చేయాలని, హాస్టల్స్‌కు 8 నెలలుగా చెల్లించాల్సిన మెస్ బిల్లుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విద్యార్థుల కోర్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ స్థలాలన్ని ప్రజల ఆస్తులని వీటిని ప్రజావసరాలకు, పేదలు ఇళ్లు కట్టుకోవడానికి, ప్రభుత్వ కార్యాలయాలకు, హాస్టళ్లు, స్కూల్ నిర్మాణాలకు మాత్రమే వినియోగించాలని, అమ్మడానికి కాదని, అమ్మితే భవిష్యత్ తరాలకు ఏమి మిగలదన్నారు. భూములను పేదలకు పంపిణి చేయాలని, హాస్టళ్ళ, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించిన తరువాతే అమ్మకాలకు పోవాలన్నారు. ప్రభుత్వం కనీసం హాస్టల్స్, గురుకులాల నిర్మాణాలకు స్థలాలైన కేటాయిస్తే ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర ప్రభుత్వం, ఎంపిల నిధుల ద్వారా భవనాలను నిర్మించుకోవచ్చునని ఆయన సూచించారు. బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 325 హాస్టల్స్, 320 గురుకులాలు ఉన్నాయని, ఒక్కదానికి కూడా సొంత భవనం లేదని, దీంతో 5 గురు విద్యార్థులు ఉండాల్సిన గదిలో 30 మంది నివసిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సొంత భవనాలను నిర్మించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.

హాస్టల్స్‌కు బకాయిల బిల్లులు చెల్లించకపోతే నిత్యావసర వస్తువుల సరఫరా నిలిపివేసే ప్రమాదం ఉందని, అద్దె భవనాలకు మూడేళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో యాజమానులు ఖాళీ చేయమని డిమాండ్ చేస్తున్నారని, దీంతో విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి ఉన్నందున తక్షణమే అద్దెలు చెల్లించాలని, విద్యార్థులకు బస్‌పాస్, చిల్లర ఖర్చులకు ప్రతి ఒక్కరికి నెలకు అమ్మాయి లకు రూ. 1000, అబ్బాయిలకు రూ. 800 మంజూరు చేయాలని, ప్రతి హాస్టల్‌కు మరో ఇద్దరు వర్కర్లను నియమించాలని, ఇంజనీరింగ్, ఎంబిఎ, ఎంసిఎ, ఫార్మసీ, పిజీ, డిగ్రీ, ఇంటర్ కోర్సులు చదివే విద్యార్థులకు మొత్తం ఫీజులను ప్రభుత్వమే చెల్లించాలని, ఫీజుల బకాయిలు 800 కోట్లు తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నేతలు నీల వెంకటేష్, అనంతయ్య, సి.రాజేందర్, జిల్లపల్లి అంజీ, నిఖిల్, చిక్కుడు బాలయ్యముదిరాజ్, మలేష్‌యాదవ్, శివకుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రమణాచారి దంపతులను సత్కరిస్తున్న మురళీమోహన్, నరసింహారెడ్డి

కనుల పండువగా కె.వి.రమణ అమృతోత్సవం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రతిభను ఫరిడవిల్లింపు జేస్తున్న కళాకారులే దేశానికి ఎన్నటికీ తరగని సాంస్కృతిక సంపద అని లోక్‌సభ మాజీ సభ్యుడు, సుప్రసిద్ధ సినీనటుడు, నిర్మాత, వ్యాపారవేత్త మాగంటి మురళీమోహన్ అన్నారు. అంతటి కళాకారులు నిత్య ప్రాతఃస్మరణీయుడుగా ఆరాధిస్తున్న సాంస్కృతిక సౌజన్య ప్రధాత, అజాతశత్రువు, కళాసంస్థలు, కళాకారులను ఆదరించి అక్కున చేర్చుకునే గొప్ప ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణ అన్నారు. సాం స్కృతికబంధు సారిపల్లి కొండలరావు సౌజన్యంతో సత్కళాభారతి, యువకళావాహిని, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం సంయుక్త నిర్వహణలో ఆదివారం ఉదయం రవీంద్రభారతి ప్రధానం మందిరంలో సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగిన జరిగిన కె.వి.రమణ అమృతోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మురళీమోహన్ విశిష్ట అతిథులు తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాల కుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ సాహితీ వేత్త డా. ఒలేటి పార్వతీశం, ప్రముఖ కళాపోషకుడు డా. బూరుగుపల్లి వ్యాసకృష్ణ, నిర్వహణా సంస్థల అధిపతులు జి.సత్యనారాయణ, లంక లక్ష్మీనారా యణ, వంగా శ్రీనివాస్‌గౌడ్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి 75వ అమృతోత్సవంను ప్రారంభించి డా. కె.వి.రమణ, పుష్పలత దంపతు లను ఘనంగా సత్కరించి ప్రసంగించారు. రమణా చారి నేతృత్వంలోని కళాకారుల సంక్షేమార్థం రూ. 5 లక్షల విరాళాన్ని మురళీమోహన్ ప్రకటించారు. అనంతరం కళాపోషకుడు వ్యాసకృష్ణ రూ. లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఏనుగు నరసింహా రెడ్డి మాట్లాడుతూ చెదిరిపోయిన కళలను ఒడిసి పట్టు కుంటారు కళాహృదయుడు రమణాచారి అన్నారు.

ప్రభుత్వ రాయితీలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలి

సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు అందిస్తున్న రాయితీలను పారి శ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) మహిళా సాధికారత జాతీయ అధ్యక్షురాలు డా.వి.వి.శ్రీలక్ష్మీవాణి పిలుపునిచ్చారు. మైద్ స్వర్ణకార్ సమాజ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కొత్త పరిశ్రమలు స్వయం ఉపాధికి సంబందించిన పూర్తి సమాచారం కోసం ఎంఎస్ఎంఈ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఎంఎస్ఎంఈ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్రకుమార్ కడేల్ అధ్యక్షత వహించారు. శ్రీలక్ష్మీవాణి మాట్లాడుతూ పరిశ్రమలు ఏర్పాటు వల్ల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఏర్పడి దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు వివిధ రంగాల్లో రాణిస్తే దేశ జిడిపిలో 30 శాతం సహకరిస్తూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కల్పిస్తూ, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయన్నారు. ఈ సదస్సులో స్వర్ణకార్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌కుమార్ సుగంద్, నిర్వహకులు రవికుమార్ అసాద్, శాంతికుమార్, నరేంద్రకుమార్, విష్ణుకుమార్ జంగా తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో ప్రసంగిస్తున్న శ్రీలక్ష్మీవాణి

రన్నరప్ యశస్విని సత్కరిస్తున్న దృశ్యం

మిస్ గ్రాండ్ తెలంగాణ 2026

రన్నర్ అప్ యశస్వినికి ఘన సన్మానం

మూసాపేట్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : మిస్ గ్రాండ్ తెలంగాణ 2026 అండర్-19 పోటీలలో రెండవ రన్నరప్‌గా నిలిచిన యశస్వినిని కూకట్‌పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకన్న, ఇష్టకామేశ్వరి కోలాటం టీం ఘనంగా సన్మానించారు. ఆదివారం మూసాపేట భరత్‌నగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్ భవనంలో ఇష్టకామేశ్వరి కోలాటం టీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమానికి కూకట్‌పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యశస్వినిని శాలువాతో సత్కరించారు. అనంతరం ఎర్ర యాకన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం తరఫున రాబోయే రోజుల్లో మిస్ ఇండియా వంటి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని రాష్ట్ర ఖ్యాతిని దేశవ్యాప్తంగా పెంపొందించాలని ఆకాంక్షించారు. యువత ఇలాంటి విజయాలతో ముందుకు రావడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో శివలక్ష్మి, మీనా కుమారి, శ్రీదేవి, జయలక్ష్మి, సుజాత వరుడు, శైలజ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన రోడ్డు స్థలాన్ని పరిశీలించిన మర్రి

బేగంపేట ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : బేగంపేట ప్రకాశం నగర్ పరిధిలోని లిటిల్ బేగంపేట లో ఒక రోడ్డు స్థలాన్ని కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమంగా ఆక్రమించుకున్నారని, వారిపై తాము అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని, తమకు న్యాయం చేయాలంటూ లిటిల్ బేగంపేట కాలనీ వాసులు బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్, మాజీ ఎన్‌డీఎంఏ ఉపాధ్యక్షులు మర్రి శశిధరరెడ్డికి విజ్ఞప్తి చేసారు. వారి విజ్ఞప్తి మేరకు మర్రి శశిధరరెడ్డి సికింద్రాబాద్ మహంకాళీ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్‌తో కల్సి ఆదివారం కాలనీలో ఆక్రమణకుగురైన రోడ్డు స్థలాన్ని పరిశీలించారు. ఈ కాలనీకి ఉత్తరం వైపు రోడ్డును కొందరు నకిలీ పత్రాలు సృష్టించి చుట్టూ గోడ నిర్మించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కాలనీ వాసులు మర్రి దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన మర్రి వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. స్పందించిన అధికారులు అక్రమ ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసారన్నారు. దీంతో పాటు తమ పక్కనే ఉన్న బస్తీలో నుంచి మురికి నీరు తమ అపార్ట్‌మెంట్ల ముందు రోడ్లపై పారుతుండటంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందన్నారు. దోమలు దాడి అధికంగా ఉంటుందని, ఈ సమస్య తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని, పరిష్కారానికి కృషి చేయాలని మర్రిని కోరారు. స్పందించిన మర్రి వెంటనే సమస్య పరిష్కరించాలంటూ వాటర్‌వర్క్స్ శాఖ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తానని, జీహెచ్ఎంసీ అధికారులతో కూడా చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు శ్రీనివాసులు, సుమన్, కృష్ణమోహన్, మధుసూదన్, తురగా లక్ష్మి, లక్ష్మణ్, రాఘవేంద్ర, రాజన్, సూర్య, డాక్టర్ కవిత, బీజేపీ నాయకులు సీ.విజయ్‌కుమార్, తారకం పేట శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన రోడ్డు స్థలాన్ని పరిశీలించి కాలనీవాసులతో చర్చిస్తున్న మర్రి

మున్సిపల్ ఎన్నికల్లో బిసి అభ్యర్థులకే పట్టం కట్టాలి

బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్జ కృష్ణ తదితరులు

సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ఈ నెల 11వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా జనరల్ స్థానాల్లో ఎన్నికల బరిలో నిలబడ్డ బిసిలను గెలిపించాలని బిజి జెఎసి నిర్ణయించిందని బిసి జెఎసిచైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆదివారం బిసి జెఎసి కార్యాలయంలో జరిగిన జెఎసి విస్తృతస్థాయి సమావేశంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లలో జరుగుతున్న ఎన్నికల్లో ఓటు మనదే, సీటు మనదే అనే నినాదంతో బిసి ప్రజలు బిసిలకే ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి బిసిల రాజకీయ ఐక్యతను, సామాజిక చైతన్యాన్ని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లు అమలు జరుగుతుండగా 10 శాతం ఉన్న అగ్రకులాలు 50 శాతం జనరల్ స్థానాల్లో పోటీచేస్తున్నారని, జనరల్ స్థానాలు అంటే రెడ్డి, రావులవేకావని ఆయన స్పష్టం చేశారు. 60 శాతం ఉన్న బిసిలకు 28 శాతం మాత్రమే కల్పించాలని, రిజర్వేషన్‌లు లేనిచోట జనరల్ స్థానాల్లో నిలబడిన బిసిలను గెలిపించడం ద్వారా బిసిలకు న్యాయం జరుగుతుందని ఆయన వివరించారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లోవలే ఈ మున్సిపల్ ఎన్నికల్లోనూ బిసిలు ఓటు అనే ఆయుధంతో అగ్రకులాలను ఓడించి తెలంగాణలో బిసి రాజ్యాధికారానికి పునాది వేయాలని ఆయన కోరారు. ప్రసుత్తం ఏ రాజకీయ పార్టీకి సిద్ధాంతాలు లేవని ఒకవేళ సిద్ధాంతాలు ఉంటే నైతిక విలువలతో ఏ పార్టీకి, ఆ పార్టీ ఇతరులతో పొత్తు లేకుండా ఎన్నికల్లో పోటీచేసేవని, కాని విచిత్రంగా బద్ధ విరోధలమని చెప్పుకుంటున్న పార్టీలు అపవిత్ర అక్రమ పొత్తులతో గెలవాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఈ సమావేశం జెఎసి రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్, బిసి విద్యార్థి జెఎసి ఛైర్మన్ బొల్లెపల్లి స్వామి సమన్వంతో జరిగింది. బిసి నేతు గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, తాటికొండ విక్రమ్‌గౌడ్, మాదేశి రాజేందర్ పాల్గొన్నారు.

డైరీని ఆవిష్కరిస్తున్న హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

గంగపుత్రులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8(ప్రభాతవార్త) : గంగపుత్రులు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలలో రాణించి ముందుకు సాగాలని హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం డైరీ ఆవిష్కరణసభ సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి అధ్యక్షతన జరిగింది. డైరీని ఆవిష్కరించిన అనంతరం బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ డెబ్బై సంవత్సరాలపాటు గంగపుత్ర సంఘం ముందుకు నడుస్తూ సమాజాభివృద్ధికి, సంఘం అభివృద్ధికి సహరించిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ గంగపుత్ర సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గంగపుత్రులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. సభలో సంఘం ప్రధాన కార్యదర్శులు చంద్రప్రకాష్, ఓం ప్రకాష్, ఉపాధ్యక్షుడు గుడబోయిన శివరత్నం, కంటే రామచందర్, ఎర్రబోయిన మల్లేష్, ప్రొఫెసర్ భాగయ్య, అదనపు డీసీపీ నర్సయ్య, నగర సంఘం అధ్యక్షుడు చాట్ల సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

బిఎంఎస్ అఖిల భారత అధ్యక్షుడిగా సుంకరి మల్లేశం

మల్లేశంను సత్కరిస్తున్న కృష్ణ తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త) : భారతీయ మజ్దూర్ సంఘ్ అఖిల భారత అధ్యక్షుడిగా తెలంగాణ ప్రాంతానికి చెందిన సుంకరి మల్లేశం ఎన్నికైనారు. భారతీయ త్రైవార్షిక మహాసభలు పూరి పట్టణంలో భువనేశ్వర్ ఒరిస్సాలో జారుతున్న విషయం తెలిసిందే. ఆదివారం భారత దేశంలోని అన్నీ రాష్ట్రాల నుండి ప్రతినిధులతోపాటు ఇటలీ, రష్యా, చైనా, మారిషస్, అబుదాబి, జపాన్ తదితర పన్నెండు దేశాల జాతీయ స్థాయి యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశాల్లో భాగంగా ఆదివారం కేంద్ర కార్య సమితిని ఎన్నుకున్నారు. అఖిల భారతీయ అధ్యక్షుడిగా సుంకర మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికైనారు. మల్లేశం తెలంగాణప్రదేశ్ నుండి 40 సంవత్సరాలుగా బిఎంఎస్‌లో వివిధస్థాయిలో పనిచేస్తూ ప్రస్తుత కేంద్ర ఉపాధ్యక్షుడిగా పనిచేస్తూనే కేంద్ర కార్మిక శాఖ, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ సభ్యులుగా కొనసాగుతున్నారు. కార్మిక లోకానికి వారు చేస్తున్నటువంటి సేవలకు దక్కిన గౌరవంగా సుంకర మల్లేశం ని కేంద్ర అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బిఎంఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి, భాగ్యనగర్ మున్సిపల్ జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ (బిఎంఎస్ అనుబంధం) ప్రధాన కార్యదర్శి టి. కృష్ణ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లేశం ను సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ బిఎంఎస్ జాతీయ అధ్యక్షుడిగా మల్లేశం కార్మికుల సంక్షేమం పట్ల అంకితభావం, నాయకత్వం నిబద్ధత నిజంగా అభినందనీయం అని అన్నారు. దూరదృష్టితో కూడిన మార్గదర్శకత్వంలో, బిఎంఎస్‌మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎం.రాధాకృష్ణ, కోశాధికారి ఆర్.వెంకటేష్, అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్. ప్రదుమన్ పాల్గొన్నారు.

మ్యూజిక్ చైర్ విజేతలకు బహుమతుల ప్రదానం

విజేతలకు బహుమతులను అందిస్తున్న పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త) : ప్రధానమంత్రి సంసద్

విజేత జట్టుతో ఆలె జితేంద్ర, ఆదర్శ మహేష్, అధికారులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : ఆలె జితేంద్ర

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని గౌలిపురా డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర అన్నారు. 2వ ఎడిషన్ ఆఫ్ చీఫ్ మినిస్టర్స్ కప్-2025 క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం గౌలిపురా ఆలె నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగింది. విన్నర్, రన్నర్ జట్లకు స్టేట్ టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదర్శ మహేష్‌తో కలిసి పతకాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలె జితేంద్ర, ఆదర్శ మహేష్ మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరికధారుఢ్యానికి దోహద పడతాయన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు లభించటంతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. సీఎం కప్ ద్వారా నిర్వహించిన కబడ్డీ, కోకో, చెస్, క్యారమ్స్ వంటి క్రీడలు విద్యార్థులలో ఆటల పట్ల ఆసక్తిని పెంచాయన్నారు. రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన టైటిల్ పంపిణీ కార్యక్రమంలో తహశీల్దార్లు సంధ్యారాణి, నిహారిక, చార్మినార్ జోన్ డిప్యూటీ ఈవో జి.సుజాత, డిప్యూటీ ఐఎఎస్ నరసరాజు, మైదానం ఇంచార్జ్‌లు కె.మహేష్, కల్పన, డివిజన్ అధ్యక్షుడు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, నేతలు జమాల్పూర్ అశోక్, ఎ.దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలి

రమాబాయిఅంబేద్కర్ జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న దృశ్యం

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: మాదిగ బంధుమిత్ర సంఘం కమిటీ ఆధ్వర్యంలో రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చుడీబజార్‌లోని అంబేద్కర్, జగ్జీజీవన్‌రామ్ కమ్యూనిటి హాల్ మాదిగ బంధుమిత్ర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోషామహాల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఉద్యమనేత, ఇన్‌చార్జ్ ఆర్వీ మహేందర్‌కుమార్, రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గోషామహాల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు యాదగిరి, మాదిగ బంధుమిత్ర సంఘం ప్రధాన కార్యదర్శి సుమన్,కమిటి సభ్యులు ఎర్ర రవి, మీసాల క్రాంతి, సందీప్, టి.సాయి, మనోజ్, రవీందర్‌రెడ్డి, కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఐ శ్రావణ్‌కుమార్‌కు సన్మానం

గోషామహాల్ సిఐ శ్రావణ్‌కుమార్ సన్మానించిన దృశ్యం

గోషామహాల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని గోషామహాల్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్‌కుమార్ కోరారు. ఇటీవల గోషామహాల్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన శ్రావణ్‌కుమార్‌ను మాదిగ బంధుమిత్ర ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువకప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుమన్, మీసాల క్రాంతి పాల్గొన్నారు.

రాగరంజితం పాండవోద్యోగ పౌరాణిక పద్యనాటకం

కృష్ణబ్రహ్మానందంను సత్కరిస్తున్న సుబ్బారావు, రాఘవరెడ్డి తదితరులు

నాంపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : శ్రీచోడేశ్వర నాట్యకళా మండలి సమర్పణలో తిరుపతి వెంకటకవులు రచించిన పాండవోద్యోగము పౌరాణిక పద్యనాటకంలో మయసభ, శయనదృశ్యముల ప్రదర్శన రాగరంజితంగా సాగి ఆహుతుల ఆకట్టుకుంది. శ్రీకృష్ణుడుగా మల్లాది వెంకటరమణ, దుర్యోధనుడుగా ఎన్.రామారావు, అర్జునుడుగా వి.పి.కె.బసవయ్య తమ తమ పాత్రలకు ప్రాణంపోసి హర్షధ్వనులతో ప్రశంసలందుకున్నారు. బావనపల్లి వెంకటసాయి మేకప్, పులిగడ్డ మంగపతిరావు సంగీతం, మల్లాది శ్రీసాయి హరీష్ సహకారంతో అలరించారు. ఈ సందర్భంగా జరిగిన సభాకార్యక్రమానికి విచ్చేసిన అతిథులు పొత్తూరి సుబ్బారావు, వి.వి.రాఘవరెడ్డి, లోకం కృష్ణయ్య, జి.నర్సింగరావు, నీలకంఠేశ్వరరావు, చంద్రకిషోర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని కళాకారులకు శుభాభినందనలు తెలిపి, విద్యాశాఖాధికారిగా విశేష సేవలందించిన ఏటుకూరి కృష్ణబ్రహ్మానందంను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆత్మరక్షణకు మార్షల్‌ఆర్ట్స్ దోహదం : ఎమ్మెల్యే

బేగంపేట ఫిభ్రవరి 8,ప్రభాతవార్త : పిల్లలకు చదువుతోపాటు ఆట, పాటలు, మార్షల్‌ఆర్ట్స్‌లలో తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించి ప్రోత్సహించడం ఎంతో అవసరమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం బేగంపేట డివిజన్ పాటిగడ్డలో ఏర్పాటు చేసిన కుంగుఫూ, మార్షల్ ఆర్ట్‌లో శిక్షణ పొందిన విద్యార్థుల ప్రదర్శనను ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే మార్షల్ ఆర్ట్స్ ఆత్మరక్షణకు దోహదపడతామని, మానసికంగా దృఢంగా ఉండేలా చేస్తాయని చెప్పారు. 4 సంవత్సరాల నుంచి 14సంవత్సరాల వయసు కల్గిన పిల్లలు చేసిన ప్రదర్శనలను ఆయన అభినందించారు. ఈ చిన్నారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో పాల్గొని అవార్డులను సాధించే విధంగా తీర్చిదిద్దాలని, అందుకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తానని ప్రకటించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, అవార్డులను పంపిణీ చేసారు. కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి, నాయకులు టి.శ్రీహరి, నరేందర్‌రావు, నిర్వహకులు చందు, కళ్యాణ్, శ్రీనివాస్ గౌడ్, శేఖర్ ముదిరాజ్, ఆరిఫ్, అఖిల్ తదితరులు ఉన్నారు.

చిన్నారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అణిచివేయాలని చూస్తే వారే అణిచివేతకుగురవుతారు

బిఆర్ఎస్ నేత దూసరి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

అణిచివేయాలని ప్రయత్నిస్తే వారికీ ఆగతేపడుతుందని బిఆర్ఎస్ సీనియర్ నేత దూసరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం అంబర్‌పేటలోని మహారాణప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో గోల్నాక డివిజన్ అభివృద్ధిపై ప్రజలకు నివేదిక కార్యక్రమం జరిగింది. గోల్నాక కార్పొరేటర్‌గా దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ ఐదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఈ సందర్భంగా దూసరి రాజకీయ ప్రత్యర్థులకు సవాల్ విసురుతూ మాట్లాడారు. తాను సన్నని కరెంట్ తీగలాంటివాడినని, దాన్ని పట్టుకోవాలని ప్రయత్నిస్తే మాడి.. మసైపోతారని హెచ్చరించారు. తాను అందరికి వెలుగునిచ్చే కరెంటు తీగలాంటివాడినని గుర్తుపెట్టుకోవాలన్నారు. తనను చెక్‌పెట్టాలని ప్రయత్నిస్తే వారికే ఆ గతి పడుతుందని హెచ్చరికలు జారీ చేశారు. ఒకరికి అపకారం చేయడం తన బెడ్‌లో లేదన్నారు. పేద కుటుంబానికి చెందిన తాను బ్యానర్ కట్టే స్థాయి నుంచి లీడర్ స్థాయికి చేరుకున్నానంటే దానికి కారణం గోల్నాక డివిజన్ ప్రజలకు నిస్వార్థంగా అందించిన సేవలన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా గోల్నాక ప్రజల పక్షాన పోరాటం ఆగదన్నారు. బఫర్ జోన్ పరిధిలోని మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని నిరుపేదల కోసం మినీ ఫంక్షన్ హాల్ లేదా ప్రజావసరాలకు వినియోగించేందుకు కృషిచేశానని, కొద్దిమంది అడ్డుకోవడంతో అది ఆగిపోయిందని చెప్పారు. ఆ భూమిని ప్రజలకు చెందేలా చివరి వరకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. హిందూ శ్మశానవాటిక అభివృద్ధి చేస్తనన్నారు. కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో అందరి ఆశీస్సులు, సహకారంతో 38.26 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. నాటి కెసిఆర్ ప్రభుత్వ హయాంలో మంత్రులు కెటిఆర్, హరీష్‌రావు, స్థానిక ఎంపి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సహకారంతో డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పరిచానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోల్నాక డివిజన్ పరిధిలోని బస్తీలు, కాలనీలవారిగా ఐదేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను పుస్తకం రూపంలో ప్రచురించిన ప్రత్యేక నివేదికను ఆత్మీయ సమ్మేళనంలో ఆవిష్కరించారు. అంతకుముందు బిఆర్ఎస్ కళాకారుల బృందంతో జరిగిన ఆటపాటలు ఆకట్టుకున్నాయి.

కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ దంపతులను సన్మానిస్తున్న మహిళలు, బిఆర్ఎస్ కార్యకర్తలు

బాలసాహిత్య కార్యశాలను ప్రారంభించిన వరప్రసాదరెడ్డి

పిల్లల్లో రచనాభిరుచిని కలిగించాలి

శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపక ఛైర్మన్ పద్మభూషణ్ వరప్రసాదరెడ్డి

నాంపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : పిల్లలకు పాఠశాల స్థాయి నుంచే మాతృభాషాభిమానం, సృజనాత్మక రచనాభిరుచిని కలిగించాలని శాంతా బయోటెక్నిక్స్, శాంతావసంతా ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ పద్మభూషణ్ డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి అన్నారు. ఆంగ్లేయులపాలనతో వారు ముందుగా మన భాషను మననుండి దూరంచేసి తర్వాత సంస్కృతిని మనకు కాకుండా చేశారని, ఇప్పటికీ మనం బానిస ప్రవృత్తితో ఆ బాటలోనే కొనసాగుతున్నామని ఆవేదనను వ్యక్తపరిచారు. తెలంగాణ సారస్వత పరిషత్తు రాష్ట్ర వ్యాప్త ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బాల సాహిత్యంపై కార్యశాలలు ప్రారంభించి వారిలో రచనాభి రుచిని ప్రోదుకల్పడం హర్షదాయకమని పరిషత్తు సేవలను ప్రశంసించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో బొగ్గులకుంటలో పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో ఆదివారం ఉదయం పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి డా.జె.చెన్నయ్య నిర్వహణలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వరప్రసాద రెడ్డి బాలసాహిత్య కార్యశాలను ప్రారంభించి ప్రసంగించారు. కొన్ని సంవత్సరాలుగా పరిషత్తు శాంతావసంతా ట్రస్టు సౌజన్యంతో బాలసాహిత్య కార్యక్రమాలతోపాటు అట్టడుగుస్థాయి నుండి విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించామని అధ్యక్షోపన్యాసంలో ఎల్లూరి శివారెడ్డి అన్నారు. డా. జె. చెన్నయ్య స్వాగతోపన్యాసంలో బాల సాహిత్యమే భావిసాహిత్యమనే నినాదంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కార గ్రహీతలు డా. దాసరి వెంకటరమణ, చొక్కాపు వెంకటరమణ, బాలసాహితీవేత్తలు గరిపెల్లి అశోక్, డా. వి.ఆర్. శర్మ, డా. అమరవాది నీరజ, తిరునగరి వేదాంత సూరి, పరిషత్తు సలహాదారు రింగురామమమూర్తి తదితరులు తమ అభిప్రాయాలు తెలిపి బాల సాహిత్య వికాసానికి పరిషత్తు ప్రయత్నం ఎంతో ఉపకరిస్తుందని అన్నారు. రాష్ట్ర పలు జిల్లాల నుండి 36 మంది తెలుగు ఉపాధ్యాయులు, భాలసాహితీవేత్తలు చర్చలో పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు.

రమాదేవికి డాక్టరేట్ ప్రదానం

హైదరాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవికి శనివారం జేఎన్టీయూ యూనివర్సిటీలో నిర్వహించిన స్నాతకోత్సవంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. రమాదేవి జేఎన్టీయూలో ఎంటెక్ పూర్తి చేశారు. అనంతరం నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గాచేరి ప్రస్తుతం ఉపకార్య నిర్వాక ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.ఉన్నత చదులపై ఆసక్తితో హైదరాబాద్‌కు బదిలీ చేయించు కొని జెన్‌టియూలో పిహెచ్‌డీ పూర్తిచేశారు.శనివారం యూనివర్సిటీలో నిర్వహించిన స్నాతకోత్సవంలో రామాదేవికి పిహెచ్‌డీ ప్రదానం చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలలో ఆసక్తితో ప్రస్తుతం ఉద్యోగ నిర్వహణతో పాటు టిబిసియుఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉద్యోగు లకు సేవలందిస్తూ అందరి మన్ననలను పొందుతున్నారు.ఈ సందర్భంగా టిబిసియుఎస్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్‌గౌడ్ ఆమెను ఘనంగా సన్మానించి అనంతరం మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఆకాంక్షి ంచారు.

రమాదేవిని సన్మానిస్తున్న చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు

ప్రైవేట్ వైద్యశాలలు ఉచిత వైద్య శిబిరాలకు

ప్రాధాన్యతనివ్వాలి : ఎమ్మెల్యే పద్మారాగౌడ్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమన్యాలు పేదలు అధికంగా నివసించే ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలను విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. నామాలగుండులో ఏర్పాటైన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వైద్య సేవలను అందిబాటులోకి తేవడంలో ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సకాలంలో వైద్య సేవలు అందని కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, రోగ నిర్ధారణ పరీక్షలు జరిపించుకోవడం కోసం గగనంగా మారిందన్నారు. ఆస్పత్రిని ఆశ్రహిస్తే ఖర్చులను తట్టుకోలేక చాలా మంది దూరంగా ఉంటూ ప్రాణాలను సైతం కోల్పోతున్నారని వివరించారు. ప్రైవేట్ వైద్యశాలలు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సామల హేమ, ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ దివ్య భండారి, సన్ రైజ్ డయాగ్నొస్టిక్ నిర్వాహకుడు జగన్, సుంకు రామచందర్, వైద్య నిపుణులు, నాయకులు పాల్గొన్నారు.

అమెరికా యుద్ధోన్మాదంపై మేధావుల గళం

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త) : దేశంలో వేగంగా పడిపోతున్న రూపాయి విలువ, అంతర్జాతీయంగా అమెరికా అనుసరిస్తున్న యుద్ధోన్మాద విధానాలు సామాన్య ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయని పలువురు మేధావులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో "రూపాయి విలువ పతనం, అమెరికా యుద్ధోన్మాద దాడులు ప్రజలపై ప్రభావం" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ వై. సుధీర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిటైర్డ్ ప్రొఫెసర్ ప్రొ. డి.నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ మార్కెట్ లో డాలర్ ఆధిపత్యం, సామ్రాజ్యవాద దేశాల కుట్రల వల్ల భారతీయ కరెన్సీ బలహీనపడుతోందని, దీని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. ప్రముఖ చరిత్రకారులు ప్రొ. వకుళాభరణం రామకృష్ణ మాట్లాడుతూ.. చరిత్ర పుటల్లో సామ్రాజ్యవాద దేశాల యుద్ధ కాంక్ష వల్ల మానవాళి ఎదుర్కొన్న నష్టాలను వివరించారు. కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ ప్రొ. తోట. జ్యోతీరాణి దేశ ఆర్థిక స్థితిగతులు, సామాన్యుడిపై పడుతున్న భారాల గురించి విశ్లేషించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.కె రచించిన "చారిత్రక భౌతిక వాదం ఒక పరిచయం" అనే పుస్తకాన్ని వక్తలు ఆవిష్కరించారు. సమాజాన్ని శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకోవడానికి ఇలాంటి రచనలు ఎంతో అవసరమని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు, మేధావులు, విద్యార్థులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్, ఫిబ్రవరి, ప్రభాతవార్త : 11 కెవి నిజాంపేట, ఎస్ఎంఎస్, ఎస్ఎల్‌జి, వెంకట్ ప్రణీత్, మావిల్లాస్, తరుణ్ భస్వానీ ఫీడర్‌లలో నేడు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 3 వరకు కాకతీయ నగర్, హిల్ కౌంటీ రోడ్, ఎస్సి కాలనీ, బాచుపల్లి జిపి, బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియా, శ్రీ హోమ్స్ కాలనీ, ఎఎస్ఆర్ బృందవన్ కాలనీ, ప్రణీత్, తరుణ్ భస్వానీ, మా విల్లాస్, కౌసల్య కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని బాచుపల్లి, ఏఈ ఎ.శశిధర్ ఓ ప్రకటనలో కోరారు.

కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌రావు మృతి

మెహిదీపట్నం, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసునూరి శ్రీనివాసరావు మృతి చెందారు. దీంతో కార్వాన్‌లోని ఆయన ఇంటి వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పసునూరి శ్రీనివాసరావు మృతి విషయం తెలుసుకున్న కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జ్ ఉస్మాన్ బిన్, నాయకులు మిత్ర కృష్ణ, బిజ్జ దుర్గాప్రసాద్, సంతోష్ గౌడ్ లు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. క్రమశిక్షణ గల కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడంతో పాటు బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం: కార్పొరేటర్

అల్వాల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందని వెంకటాపురం కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని కానాజీగూడ శ్రీనివాస కాలనీలో 12 లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. డివిజన్ పరిధిలో అన్ని ప్రాంతాలులో రోడ్లు ఏర్పాటును పూర్తిచేశామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, ప్రభాకర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

ముషీరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త: బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12 వ తేదీ చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియూ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్షులు ఎం.దశరథ్ పిలుపునిచ్చారు. ముషీరాబాద్‌లోని సిఐటియు నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను కుదించి, నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులను కట్టుబానిసలుగా మార్చే ఈబిల్లులకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న ఆర్టీసీ కళ్యాణ మండపం నుంచి ఇందిరాపార్కు వరకు జరిగే భారీ ర్యాలీలో కార్మికులంతా పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ జోన్ కార్యదర్శి టి.మహేందర్, జోన్ నాయకులు ఎం.ఎ.బాబు, ఏ.బాబు, శ్రీహరి, జ్యోతి, లత, శాంత, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : పాతబస్తీ చాంద్రాయణగుట్ట కేశవగిరిపై వెలసిన స్వయంభుః శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఉత్సవాలలో భాగంగా ప్రధాన అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యులు, అర్చకులు పరాంకుశం సుధీర్‌కుమారాచార్యులు, కంజర్ల ప్రణయ్‌కుమారాచార్యులచే సేవాకాలం, బాలభోగం, అంకురార్పణ, పుణ్యావాచనం, అగ్నిప్రతిష్ఠ, కుంభావాహన, చతుస్థానార్చన, ధ్వజారోహనం, బలిహరణ, సాయంత్రం పారాయణం, మూలమంత్ర హవనం, పూర్ణాహుతి, భేరితాడనం, దేవాతాహ్వానం, శాత్తుమొర, తీర్థప్రసాద వినియోగం తదితర పూజా కార్యక్రమాలను మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. సమీప బస్తీల భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు ఎ.మహేష్‌గౌడ్, ఎ.శ్రీధర్, కె.శైలేష్, బి.వందన, ఆర్.విజయలక్ష్మి పాల్గొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రెండవ రోజైన సోమవారం రాత్రి 7 గంటలకు స్వామివారు అమ్మవార్ల ఎదుర్కోళ్లను నిర్వహించనున్నారు.

జాంబాగ్ డివిజన్‌ను అభివృద్ధి చేశా : కార్పొరేటర్

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకుగాను తన శక్తి వంచన లేకుండా కృషి చేసినట్లు జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ తెలిపారు. డివిజన్ పరిధిలో పైపులైన్, డ్రైనేజీ, సిసిరోడ్డు అభివృద్ధి పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల పాటు మంచి నీటి పైపులైన్, డ్రైనేజీ పైపులైన్, సిసి రోడ్డు, విద్యుత్ దీపాలు, కమ్యూటి నిర్మాణ పనులను చేయించినట్లు వివరించారు. తనపై నమ్మకం ఉంచి ఐదు సంవత్సరాల క్రితం బిజెపి ఓటు వేసి గెలిపించిన ప్రజలకు అందుబాటులో అనేక అభివృద్ధి పనులతోపాటు సంక్షేమ పథకాలను ప్రజలకు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప ధర్మశాస్త్ర సేవ సమితి ఆధ్వర్యంలో అన్నదానం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: అయ్యప్ప ధర్మశాస్త్ర సేవసమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ, పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రుల్లో 350 మంది అన్నార్తులు, అభాగ్యులు, రోగి సహాయకులకు ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పదేళ్లుగా అనేక సామాజిక, ఆధ్మాత్మిక సేవ, ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టామని నిర్వాహకులు తెలిపారు. శిల్పినగర్, బోరబండ ఫేజ్-3కు చెందిన ప్రముఖ ఫైట్ మాస్టర్ పొందర కామేశ్వరరావు(పీఎన్‌బాజీ) కుమారి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో చింతల్ అయ్యప్ప ధర్మశాస్త్ర సేవ సమితికార్యదర్శులు వెంకటేష్ (బొంబాయి గురుస్వామి), పుల్లారావు, సమితి ప్రతినిధులు కేవీ రాజేంద్ర ప్రసాదరావు, సుబ్రహ్మణ్యం, కృష్ణ మూర్తి, ఈశ్వర్‌రెడ్డి, కిషోర్, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, యాదగిరి, రామకృష్ణ, లింగమయ్య, కనకదుర్గ, అపర్ణ, నాగయశస్వీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి : శ్రీశైలంగౌడ్

నిజాంపేట్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : గజ్వేల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి ఆదివారం గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని మల్లన్న సాగర్ నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ కాలనీల పరిధిలోని 8వ, 9వ, 10వ, 11వ, 12వ, 19వ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ మల్లన్న సాగర్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆ

సప్రచారంలో పదనిసలు

సోనియా, ప్రియాంకను తలపించేలా వేషధారణతో వచ్చిన చిన్నారులను ఎత్తుకున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

కాంగ్రెస్ ప్రచారంలో
ఢిల్లీ నేతలు

షాద్‌నగర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : పట్టణంలోని 23, 24 వార్డు ప్రచారాలలో వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు. ఒకరు ఆరేళ్లు కూడా నిండని చిన్నారి సోనియా గాంధీ.. ఇంకొకరు నాలుగేళ్లు దాటని చిట్టి ప్రియాంక గాంధీ.. ఇదేమిటని ఆశ్చర్యపోతున్నారా.. పట్టణంలోని 23, 24 వార్డుల్లో అభ్యర్థులు అగ్గనూరు విశాల, అగ్గనూరు బస్వం తరపున ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌల్లపల్లి ప్రతాపరెడ్డి లకు ఇద్దరు చిన్నారులు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ రూపంలో స్వాగతం పలికారు. వాళ్ల వేషధారణ చూసి మురిసిపోయిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే వారిని ఎత్తుకొని ఆశీస్సులు అందించారు. ఈ దృశ్యం వార్డు ప్రజలను విపరీతంగా ఆకట్టుకుంటుంది.

బోసి నవ్వుల బంగారం రేపటి తరానికి నాయకత్వం

ఆమనగల్లు మూడవ వార్డు సాకిబండ తండాలో బిజెపి అభ్యర్థి తల్లోజు గీత ఆచారి బిజెపి కండువా వేసుకున్న గిరిజన చిన్నారిని ఎత్తుకొని ముద్దు .. ముర్రిపెం చేశారు. చిన్నారి కూడా బిజెపికి జై అన్నట్టుగా చెయ్యెత్తి ఊపుతూ అందర్నీ నవ్వించారు.

-ప్రభాతవార్త, ఆమనగల్లు

సోడా కొట్టి సేద తీర్చి...

షాద్‌నగర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : ఎన్నికలు అంటేనే చిత్రాలు.. విచిత్రాలు.. సరదాలు.. సంతోషాలు.. ఎన్నో కనిపిస్తుంటాయి.. గెలుపు ఓటములపై నిరంతరం ఉత్కంఠగా ఉండే నాయకులు అవకాశం దొరికినప్పుడు సరదాగా ఎంజాయ్ చేస్తుంటారు.. ఆదివారం ఇంటింటి ప్రచారంలో భాగంగా మెయిన్ రోడ్డు పై తిరిగిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గోలీసోడా కొడుతూ కనిపించగా, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి అల్లం, వెల్లుల్లి అమ్ముతూ, మరోచోట మటన్ షాప్ లో అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం మటన్ షాప్ లో కూడా దర్శనమిచ్చారు. సరదాగా సాగిన ఈ ప్రచారం ఓటర్లను విపరీతంగా ఆకట్టుకుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఆర్‌టిసి బస్సుడ్రైవర్ నిర్లక్ష్యం ఫలితం

యాచారం, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని దేవరకొండ ఆర్టిసి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆ జాగ్రత్తతో ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచాల మండలం దాత్ పల్లి అనుబంధ గ్రామమైన వెంకటేశ్వర తండాకు చెందిన ఆర్య నాయక్ (50) యాచారం వ్యవసాయ సహకార సంఘంలో యూరియా కొనుగోలు చేయడానికి వచ్చి ప్రమాదాన్ని గురై అక్కడికక్కడే మృతి చెందారు. హైదరాబాదు నుండి దేవరకొండ వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్రెస్ బస్సు యాచారం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఉన్న విస్మరించి అతివేగంగా మొండి గారెల్లి వెళ్లే దారిలో బైకును ఢీకొట్టడంతో బైక్ పై ఉన్న హార్యనాయక్ పది మీటర్ల దూరంలో పడి అక్కడికక్కడే మరణించారు. 108 లో తీసుకెళ్లడానికి ప్రయత్నించిన అప్పటికే అమృత చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి నలుగురు కూతుర్లు ఒక అబ్బాయి. వృత్తిరీత్యా హైదరాబాదులో ప్యాసింజర్ ఆటో నడుపుకుని, ఊర్లో వ్యవసాయం చేసుకొని జీవనం సాగించేవాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేదలకు నీడనిచ్చేది ఎర్రజెండానే

సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

షాద్‌నగర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : మున్సిపాలిటీ ఎన్నికలలో పేద ప్రజలు ఆదరిస్తే అభివృద్ధి చేస్తామని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు ఆదివారం నాడు ఫరూక్నగర్ ప్రజలకు ఎన్నికల ప్రచారంలో భాగంగా వీధి, వీధి తిరుగుతూ ప్రజలను కలుస్తూ సమస్యలు తెలుసుకుంటూ ఆదరిస్తే అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పగడాల యాదయ్య మాట్లాడుతూ, 13 వ వార్డులో ఇప్పటికి పేద ప్రజలకు సొంత నివాస గృహాలు లేకపోవడం విచారకరమని ఆయన అన్నారు. చిన్న, చిన్న పూరి గుడిసెలలో నివసిస్తూ కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని రెండు మూడు రోజులకు ఒకసారి నీళ్లు రావడం వల్ల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ఈ కాలనీలో ఎక్కువగా పాత ఇనుప సామాన్లు కొనుగోలు అమ్మకాలు పై ఆధారపడి జీవించే కుటుంబాలు ఎక్కువగా ఉండటం వల్ల రోజు నిత్యం ప్రజలు అనేక సమస్యలతో సతమత అవుతున్నారు కనీసం రోడ్డు సౌకర్యం కూడా సరిగా లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కాలనీలో ఎక్కువగా పేదరికంలో ఉండి కనీసం పిల్లలకు చదువు కొనే అవకాశం లేకుండాపోయిందన్నారు.

కోట్‌పల్లి ప్రాజెక్టుకు పోటెత్తిన పర్యాటకులు

ధారూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : ధారూర్ మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు ఆదివారం సెలవు రోజు కావడంతో పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో పాటు హైదరాబాద్ మహానగరం నుండి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో ప్రాజెక్టు పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చిన సందర్శకులు ప్రకృతి ఒడిలో ఆహ్లాదంగా గడిపారు. ప్రాజెక్టులో ప్రధాన ఆకర్షణగా నిలిచిన కయాకింగ్, బోటింగ్ చేసేందుకు పర్యాటకులు ఎంతో ఉత్సాహం చూపారు. వారాంతపు సెలవు ను ఎంజాయ్ చేసేందుకు వచ్చిన చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ ప్రాజెక్టు అందాలకు ముగ్ధులయ్యారు. చెట్ల కింద కూర్చుని వనభోజనాలు చేస్తూ సరదాగా గడిపిన పర్యాటకులు, సాయంత్రం వరకు ఇక్కడే ఉండి తిరుగుప్రయాణమయ్యారు. పర్యాటకుల తాకిడి పెరగడంతో స్థానికంగా చిన్న తరహా వ్యాపారులకు కూడా మంచి గిరాకీ లభించింది.



షాద్‌నగర్‌లో వలస ఓటర్ల తీరు ఇదీ..

షాద్‌నగర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : ఒక వ్యక్తికి ఒకచోట ఓటు ఉంటుంది.. ఒక్క నాయకుడిని మాత్రమే ఎన్నుకునే అవకాశం ఉంటుంది.. కానీ కొంతమంది రెండు చోట్ల ఓట్లను యధావిధిగా కొనసాగిస్తున్నారు.. ఒకవైపు తమ గ్రామాలలో సర్పంచులకు ఓటు వేస్తూ.. తాజాగా కౌన్సిలర్ ఎన్నికల్లో కూడా ఓటు వేసేందుకు సిద్ధమవుతున్నారు.. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని 7వ వార్డులో నెలకొన్న పరిస్థితి ఇది.. మరో మల్కాజిగిరిగా చెప్పుకునే ఏడవ వార్డులో ఎక్కువ శాతం వివిధ గ్రామాల నుంచి వచ్చిన నివాసం ఉంటున్న వారు ఉన్నారు.. వారికి రెండు చోట్ల ఓటు ఉన్నది అనేది ప్రధాన ఆరోపణ.. వివరాల్లోకి వెళితే..పట్టణంలోని ఏడవ వార్డులో ఎక్కువ శాతం గ్రామీణ ప్రాంతాల నుంచి తమ పిల్లల చదువుల కోసం, ఉద్యోగాల నిమిత్తం, వ్యాపారాల నిమిత్తం వచ్చి ఉంటున్న వారు చాలామంది ఉన్నారు. తలకొండపల్లి, నిడదవెల్లి, కాకునూర్, రాయికల్, కిషన్ నగర్, హాజిపల్లి తదితర గ్రామాల వారు ఇక్కడ నివాసం ఉంటున్నారు. అంతేకాదు పరిశ్రమల్లో పని చేసేందుకు ఇతర రాష్ట్రాల వారు కూడా ఇక్కడ వార్డులో నివాసం ఉంటున్నారు. వీళ్ళందరికీ ఇక్కడ ఓట్లు ఉన్నాయి.. అలా ఉండటంలో తప్పులేదు. కానీ ఇక్కడే కాకుండా తమ తమ స్వస్థలాలలో కూడా వీరికి ఓట్లు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక వ్యక్తికి రెండుచోట్ల ఓట్లు ఉండడం ఏసీ నిబంధనల రీత్యా నేరం. కానీ ఈ నేరం యధావిధిగా కొనసాగుతుందనేది ఆరోపణ.

ఏడవ వార్డులో 3,724 మంది ఓటర్లు ఉండగా ఇందులో వందలకు పైగా ఓట్లు ఇలాంటివి ఉన్నాయి. అనేది ఆరోపణ. ఇదే ఆరోపణ పై ఆధారాలతో సహా గతంలో నాయకులు పోలీసులకు, అధికారులకు కొందరు స్థానిక నాయకులు ఫిర్యాదు చేశారు. కానీ దీనిపై ఇప్పటిదాకా అధికారులు ఎటు తేల్చలేదు. కాగా ప్రస్తుతం ఈ వార్డులో గత సర్పంచ్ ఎన్నికల్లో ఓటు వేసిన వారే మళ్లీ ఓటు వేసే అవకాశం ఉందని నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఎన్నికల అధికారులు,

ఏడవ వార్డులో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల వారే..

సొంత ఊళ్లోనూ..ఇక్కడా ఓటు నమోదు

పంచాయతీ ఎన్నికలలో ఇక్కడ నుంచి అక్కడకు క్యూ..

మున్సిపల్ పోలింగ్‌లోనూ ఓటు హక్కు వినియోగానికి రెడీ

పోలీసులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎన్నికలకు ఇంకా నాలుగు రోజులు మాత్రమే సమయం ఉంది. మరి ఈ లోపల అధికారులు ఈ వ్యవహారంపై స్పందిస్తారా.. లేక చూసి చూడనట్లు వదిలేస్తారా.. అన్నది వేచి చూడాలి. ఎన్నికల్లో పెద్ద ఎత్తున ఆయా గ్రామాలకు చెందిన ఓటర్లు ఇక్కడ పేర్లు నమోదు చేసుకుని రెండోసారి ఓట్లు వేయడానికి కూడా సిద్ధమవుతున్నట్లు సమాచారం. మొన్న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసిన వారితో సహా అక్కడ ఓట్లు వేసిన వారు చాలామంది ఇక్కడ ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తున్నారు. ఎన్నికల్లో మీరు గనక ఓట్లు వేస్తే రభస జరిగి గొడవలు కూడా జరిగే అవకాశాలు ఉన్నాయి .

నేటితో ప్రచారానికి తెర

స్థానికేతర నేతలు ఇక్కడ ఉండొద్దు

ఎన్నికల నియమావళిని పాటించాలి

ప్రలోభాలకు పాల్పడితే చర్యలు తప్పవు

డిసిపి శ్రీధర్ స్పష్టీకరణ

శామీర్‌పేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : మూడుచింతలపల్లి మున్సిపల్‌లో ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రంతో ముగుస్తున్నందున ఎన్నికల నిబంధనల ప్రకారం మున్సిపల్ పరిధిలో ఓటరు కాని వారు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, రాజకీయ సంబంధిత స్థానికేతరులు ఉండరాదని మల్కాజ్‌గిరి జోన్ డిసిపి శ్రీధర్ స్పష్టం చేశారు. ఆదివారం ఈ సందర్భంగా పేర్కొంటూ శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూడుచింతలపల్లి మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్నందున ప్రచారం గడువు ముగుస్తున్నందున ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రచార గడువు ముగిసిన వెంటనే ఇతర ప్రాంతాలకు చెందిన రాజకీయ నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ పరిధిని విడిచి వెళ్లాలని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా కొనసాగితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు గురి చేసే చర్యలు, డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీ చేయటం వంటి అక్రమ కార్యకలాపాలపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కల్గించే అవకాశం ఉన్న రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా ఉంటుందని, నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. ప్రజలు స్వేచ్ఛాయుతంగ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికలు నిర్వహించటమే పోలీస్‌శాఖ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని, అన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు పాటించి పోలీస్‌శాఖకు సహకరించాలని డిసిపి శ్రీధర్ ప్రజలకు సూచించారు.

దివ్యాంగులు ఏ ఇబ్బందీ రాకూడదు

పోలింగ్ బూత్‌ల వద్ద వసతులపై కలెక్టర్ ఆదేశం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : ఈ నెల 11వ తేదీన మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాల్టీలు ఎల్లంపేట్, అలియాబాద్, మూడుచింతలపల్లి లో ఎన్నికలు (పోలింగ్) జరుగుతున్నందున ఓటు హక్కును వినియోగించుకోవటానికి దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు.

పోలింగ్ ప్రక్రియలో దివ్యాంగులు చురుకుగా పాల్గొనేందుకు వారిని ప్రోత్సహించాలన్నారు.పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల ఓటర్ల సంఖ్యను బట్టి ర్యాంపులు, వీల్‌చైర్‌లు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. దీనికి సంబంధించి పోలింగ్ సిబ్బందికి కూడ అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. వికలాంగులకు ప్రాధాన్య ప్రవేశ పాసులు జారీ చేయాలని, దివ్యాంగులు క్యూలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండ అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు.

13 ఏళ్లుగా ఎందుకీ జాప్యం?

రైల్వే వంతెన నిర్మాణం పూర్తి చేయాలని మహిళల డిమాండ్
భారీ ర్యాలీ..నినాదాలతో నిరసన

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త: ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వేవంతెన పనులు త్వరగా పూర్తి చేసి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఘట్‌కేసర్ డివిజన్ ఇడబ్ల్యుఎస్‌కాలనీ చౌరస్తాలోని స్వామి వివేకానంద విగ్రహం నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ జగదాంబ థియేటర్, రైల్వేగేటు మీదుగా రహదారిపై బస్‌టెర్మినల్ ముందు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. కొండాపూర్, బాలాజీనగర్, ఇడబ్ల్యుఎస్‌కాలనీ, గాంధీనగర్, మేడపాటినగర్, బృందావన్‌కాలనీ, ద్వారకానగర్ తదితర కాలనీల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మహిళలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాళలు వేసి నివాళులు అర్పించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్దపెట్టున నినాదాలతో హోరెత్తించారు. రైల్వేవంతెన నిర్మాణ పనులు చేపట్టి 13 సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి కాకపోవడంపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వేగేటు కారణంగా అత్యవసర సమయాల్లో కొందరు వైద్యం అందక చనిపోయారని, గత 15 ఏళ్లుగా రెండు ప్రభుత్వాలు, ముగ్గురు ఎమ్మెలేలు మారారని, మాజీ ప్రజాప్రతినిధులు ఎంతో పని చేశామని గొప్పలు చెబుతున్నారని వంతెన మాత్రం పూర్తి చేయించలేక పోయారని మహిళలు ధ్వజమెత్తారు.

పాత కాంట్రాక్టర్‌రు రద్దు చేయించిన మంత్రి మల్లారెడ్డి కొత్త కాంట్రాక్టర్ సత్తిరెడ్డికి టెండర్ ద్వారా ఆర్‌ఓబి పనులు అప్పగించి మూడు నెలల్లో పూర్తి చేయిస్తామని మల్లారెడ్డి హామీ ఇచ్చారని 3 సంవత్సరాలు గడుస్తుందని ఎమ్మెల్యే, కాంట్రాక్టర్ వచ్చి ప్రజలకు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కెఎస్ఆర్ ఇఫ్రా హోల్డింగ్స్ కాంట్రాక్టర్ బైపాస్ రహదారి వంతెన పనులు వేగవంతగా చేస్తూ ఆర్‌ఓబీ పనులను మాత్రం తక్కువ కార్మికులతో ఆలస్యంగా చేయిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘట్‌కేసర్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న పలు కాలనీల మహిళలు

ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు తమ స్వార్థ రాజకీయాలతో పేరు కోసం పాకులాడుతూ సోషల్‌మీడియాలో గొప్పలు చెబుకుంటున్నారని, బాధితులకు నష్టపరిహారం చెల్లించడం, రైల్వేవంతెన సకాలంలో పూర్తి చేయించడంలో ఘోరంగా విఫలమయ్యారని అందుకే గేటు అవతల కాలనీ మహిళలు ఆందోళన చేపట్టామని తెలిపారు. నిరసన ర్యాలీ సందర్భంగా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాస్, ఎస్ఐలు బి.ప్రభాకర్‌రెడ్డి, ఎ.శేఖర్, రాఘవేంద్ర, షేక్‌హీనాలు సిబ్బందితో ఏలాంటి గొడవలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వజ్రేశ్‌యాదవ్

అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలకూ
ప్రాధాన్యం ఇస్తున్నాం

మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ ఇవ్వండి
డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్

శామీర్‌పేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతుందని, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మెజార్టీతో గెలిపించాలని మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ కోరారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని కేశవరం, కేశ్వాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో కాలనీల్లో పర్యటించి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చిన విధంగ దశల వారీగ వాటిని అమలు చేస్తుందన్నారు.

ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే, మున్సిపాల్టీ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకుందామని మరింత అభివృద్ధిని చేస్తామని అన్నారు. గ్రామాల వార్డుల ప్రజలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని ఈ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసింది ఏమి లేదని, కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసుకోవటానికి అవకాశం ఉంటుందని డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. కేశవరం, కేశ్వాపూర్ గ్రామాల్లో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి ఎస్.హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, పలువురు పార్టీ అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గులాబీ మయంగా
గాంధీనగర్ కాలనీ

ఇంటింటి ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : షాద్ నగర్ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 28వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి చేగూరి లక్ష్మి ప్రసన్న వేణుగోపాల్‌కు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రచారంలో భాగంగా కాలనీవాసులు బీఆర్ఎస్ నాయ కులకు, 28వ అభ్యర్థికి బ్రహ్మరథం పట్టారు. అంజయ్య యాదవ్ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో షాద్ నగర్ మున్సిపాలిటీలో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. పట్టణంలోని వివిధ కాలనీలలో సిసి రోడ్లు అంతర్గత మురుగు కాలువలు తాగునీటి వసతి వీధి దీపాల ఏర్పాటు వంటి ప్రజల అవసరాలకు కావాల్సిన వసతులను కల్పించడం జరిగిందని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరిగిందని అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం బీఆర్ఎస్ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందని అన్నారు.

ఇసి నిబంధనలకు నీళ్లు

ప్రచారకర్తలకు ప్రతిరోజు నగదు, భోజనంతో పాటు మద్యం
వార్డుకు రూ.10 లక్షలు దాటిపోతున్న ఖర్చు

ఆమనగల్లు, ఫిబ్రవరి8, ప్రభాతవార్త: భవిష్యత్తులో ఎన్నికల బరిలో పోటీ చేయాలంటే సామాన్య మానవుడు భయపడే స్థాయికి పరిస్థితులు దిగజారాయి. ప్రజాసేవ కొరకు ప్రజాప్రతినిధిగా రావాలంటే లక్షల నుండి కోట్ల రూపాయల ఖర్చు చేయవలసి పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో బలబలాలను ప్రదర్శించేందుకు అభ్యర్థులు చేస్తున్న వ్యయం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో చర్చనీయాంశంగా మారింది. ఒక వార్డు కౌన్సిలర్ గా పోటీ చేయాలంటే ఇంత ఖర్చు పెట్టాలా అని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజాసేవ చేయాలంటే ఇంత వ్యయప్రయాసలు గురికావాలా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఆమనగల్లులో ఎన్నికలు మునుపెన్నడు లేని విధంగా కాస్ట్లీగా మారిపోయాయనే చర్చ సాగుతోంది. ప్రచారంలో బలాబలాల ప్రదర్శనకు వెనకాడకపోవడంతో పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు ప్రచార కూలీలను సైతం వినియోగిస్తున్నారు. వీరికి ఆఫర్‌లతో నగదుతో పాటు మద్యం, భోజనాలు అందిస్తున్నారు. దీంతో అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ మహిళలు, పురుషులు, యువత, వృద్ధులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. కొందరైతే ఉదయం ఒక పార్టీకి, సాయంత్రం మరో పార్టీకి ప్రచారం చేస్తూ ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు. అలాగే ఉపాధి కొరకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన ఓటర్లను రప్పించ్చి లబ్ది పొందేందుకు అభ్యర్థులు ప్రత్యేక ఆఫర్లు, రాకపోకల ఖర్చులు ఇస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కాగా ఆమనగల్లు బల్లియాను కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని హోరా హోరీగా పోటీపడుతున్నాయి. దీంతో ఎన్నికల ఖర్చు తడిసి మోపడవుతుందనే వాదనను ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ఏ నలుగురు ఒక చోటికి చేరిన ఎన్నికల ఖర్చు, అభ్యర్థుల బలాబాలాలు, గెలుపు అవకాశాలు ఎవ్వరికి ఎక్కువగా ఉన్నాయో ముచ్చటించుకుంటున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం మున్సిపాలిటీ ఎన్నికల్లో ఒకవార్డు అభ్యర్థి రూ.1 లక్షకు మించి ఖర్చు చేయకూడదని నిబంధన ఉంది. కానీ ప్రస్తుత అభ్యర్థులు పెడుతున్న దాదాపు రూ.10 లక్షలు ఖర్చు దాటిపోతోందని అంచనా. ఓటర్లను ఆకర్షించేందుకు డిజె సౌండ్లు, ప్రచార రథాలు మోత మోగిస్తుండగా, కొంతమంది కళాజాత బృందం వాడుకుంటున్నారు. అలాగే ఈసారి గోడపత్రికలు కూడా పెద్ద ఎత్తున విచ్చలవిడిగా వినియోగిస్తున్నట్లు కూడా కనిపిస్తోంది.